భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

23, జులై 2026, గురువారం

భారత్ సమాచార్

# మున్సిపల్ కార్యాలయంలో 'క్యాచ్ ది రైన్' కార్యక్రమం




**భారత్ సమాచార్, మెదక్ జిల్లా:** నర్సాపూర్ పురపాలక సంఘం కార్యాలయంలో 'క్యాచ్ ది రైన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీరాజు యాదవ్, మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు (ఇంకుడు గుంతలు) నిర్మించేందుకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు పాల్గొని వర్షపు నీటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ మాట్లాడుతూ, ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల భూగర్భ జల వనరులు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో కురిసే ప్రతి వర్షపు నీటి బొట్టును, ఇంటి వినియోగం అనంతరం వచ్చే నీటిని కూడా రీచార్జ్ పద్ధతిలో భూమిలోకి పంపించడం ద్వారా బోరుబావుల్లో నీటి మట్టం పెరుగుతుందని వివరించారు. ఇలా చేయడం వల్ల ప్రస్తుతంతో పాటు భావితరాలకు కూడా మంచినీటి కొరత లేకుండా ఉండే అవకాశం ఉంటుందని చెప్పారు.

ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల భూగర్భ జలాలు పెరగడమే కాకుండా భూమి ఉష్ణోగ్రత నియంత్రణకు, లోతట్టు ప్రాంతాల్లో వరదల తీవ్రత తగ్గించేందుకు కూడా ఉపయోగపడుతుందని కమిషనర్ వివరించారు. ప్రస్తుతం కాంక్రీటీకరణ పెరగడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గిపోయాయని, అందువల్ల ప్రతి ఇంటి వద్ద రైన్ వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం అత్యవసరమని సూచించారు. నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు.

మున్సిపాలిటీ పరిధిలో 200 చదరపు గజాలకు పైగా విస్తీర్ణంలో భవనాలు నిర్మించిన యజమానులు తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. నిర్ణీత గడువులోపు నిర్మించని పక్షంలో తెలంగాణ మున్సిపల్ చట్టం–2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ వనముల బుచ్చేష్ యాదవ్, కౌన్సిలర్లు అంతారం సుధీర్ గౌడ్, చింతకుంట శ్రీకాంత్, మున్సిపల్ మేనేజర్ వైట్ల మధుసూదన్, మున్సిపల్ సిబ్బంది, పట్టణ ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar